క్లుప్తంగా

ఈఆర్ఓను తనిఖీ చేసిన ఎస్ఈ



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

దర్శి (కురిచేడు): పొదిలి రోడ్‌లోని విద్యుత్ శాఖ ఈఆర్ఓ కార్యాలయాన్ని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. విద్యుత్ పాత బకాయిలు కట్టించాలని, ఓవర్ లోడ్ ఫీడర్లకు పరిష్కారం చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యవసాయానికి నిరంతరంగా 9 గంటల విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఆదేశించారు. పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వలంటీర్ అడిషనల్ లోడ్ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈఈ శ్రీనివాసులు, టౌన్ ఏఈ అంకబాబు, రూరల్ ఏఈ వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్థులు ఆరు నెలలు చికిత్స పొందాలి




వ్యాధిగ్రస్థులతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీవాణి

దొనకొండ: క్షయ వ్యాధిగ్రస్థులు 6 నెలలు తప్పకుండా చికిత్స పొందాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ వ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ శ్రీవాణి తెలిపారు. మంగళవారం మండలంలోని కట్టకిందపల్లి, నారపురెడ్డిపల్లి, రుద్రసముద్రం గ్రామాలకు చెందిన కుష్టువ్యాధిగ్రస్థుల కుటుంబ సభ్యులకు చికిత్స అందించారు. ఆమె వ్యాధిగ్రస్థుల ఇంటి వద్దకు వెళ్లి వారికి అందుతున్న సేవలపై సమీక్షించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి 6 నెలల పాటు బలమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. 2030 సంవత్సరం నాటికి ఇండియాను క్షయవ్యాధి రహిత దేశంగా చేయాలన్న లక్ష్యంతో పని చేయాలని సిబ్బందికి సూచించారు. సిబ్బందికి సూచన, సలహాలు అందజేశారు. ఆమె వెంట వైద్యాధికారి అన్వేష్‌కుమార్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి, మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్, సీహెచ్ఓ ఇన్నాసమ్మ, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ సాయి, సీనియర్ టీబీ సూపర్‌వైజర్ సురేష్ పాల్గొన్నారు.

సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు

పెద్దారవీడు: పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీతో రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తోందని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ పొలంలో పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేస్తే భూమిని పదిరెట్లు ఎక్కువ సారవంతం చేస్తుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాల కింద జీలుగలు, జనుము, పిల్లి పెసర ద్వారా భూసారం పెంచుకునేందుకు వీలుగా పొల్లాల్లో చల్లి పూతకు వచ్చిన తర్వాత కలియదున్నితే సేంద్రియ పదార్థం బాగా పెరుగుతుందని చెప్పారు. జీలుగులు విత్తనాలు 10 కిలోలు సంచి పూర్తి ధర రూ.1,230 ఉండగా సబ్సిడీ రూ.615 రైతు వాటా రూ.615, జనుము విత్తనాలు 10 కిలోలు సంచి పూర్తి ధర రూ.1,090 ఉండగా సబ్సిడీ రూ.545 రైతు వాటా రూ.545, పిల్లి పెసర 8 కిలోలు సంచి పూర్తి ధర రూ.1,440 ఉండగా సబ్సిడీ రూ.720 రైతు వాటా 720 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మండలంలో రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





పెద్దారవీడు: ఎండ తీవ్రత, వడగాలులకు మండల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 9 గంటలు దాటితే ఉష్ణోగ్రత తీవ్రంగా ఉండటంతో ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితి కనబడటం లేదు. ఓ వైపు ఉక్కపోత మరో వైపు ఎండ తీవ్రతతో మధ్యాహ్నం సమయంలో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ప్రస్తుతం 40 నుంచి 42 డీగ్రీల వరకు ఉష్ణోగ్రత తగ్గక పోవడంతో బయటకు రావాలంటే వృద్ధులు, చిన్నారులు బయట తిరిగేందుకు భయపడుతున్నారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత వేడి గాలుల కారణంగా ప్రజలు ఆరోగ్య సూత్రాలతో పాటు పలు జాగ్రత్తలు పాటించాలని, లేకుంటే వడదెబ్బకు గురై మృత్యువాత పడే అవకాశం కూడా ఉంటుందని స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జగదీష్ హెచ్చరిస్తున్నారు. వేసవిలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

వడదెబ్బ సోకితే ప్రథమ చికిత్స ఇలా..

తీవ్ర ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరగడం, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వడదెబ్బగా గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి చేర్చాలి. చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరాన్ని బాగా తుడవాలి. శరీరం ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు అలాగే చేస్తుండాలి. చల్లని గాలి తగిలే విధంగా ఉంచాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి నీరు తాగించరాదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.

వడదెబ్బ లక్షణాలు

- చెమట పట్టక పోవడం.. శరీర ఉష్ణోగ్రత పెరగడం
- వణుకు పుట్టడం.. మగత, నిద్రలేక కలవరింతలు
- ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం

చేయకూడనివి..

- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో బయట అధిక శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు
- బాలింతలు, చిన్న పిల్లలు, వయో వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరగరాదు
- శీతల పానీయాలు, ఐస్ ముక్కలు తీసుకుంటే అనార్యోనికి గురవుతారు
- భోజనం మితంగా తినాలి. మాంసాహారాన్ని తగ్గించాలి. మద్యం సేవించరాదు.
- నల్ల దుస్తులు, మందంగా ఉన్న దుస్తులు ధరించరాదు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

బయటకు వెళ్లేటప్పుడు గొడుగు తీసుకెళ్లాలి. తలకు టోపీ లేదా కండువా కట్టుకోవాలి. తెలుపు రంగు కాటన్ వస్త్రాలు ధరించాలి. రోజుకు కనీసం 15 గ్లాసులు మంచి నీరు తాగాలి. పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

రోజుకు రెండు పూటలా స్నానం చేయాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ లేదా ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి. ఎండలో నుంచి వచ్చిన వెంటనే చల్లటి నిమ్మరసం, కొబ్బరి నీరు తాగాలి. వడదెబ్బకు గురైన వారిని సాధారణ స్థితికి రానిచో శీతల వాతావరణంలో దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు రాములు

పుల్లలచెరువు: మండల స్థాయిలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు తమ విధులు గుర్తు చేసుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎల్.రాములు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వెంకటయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొని ఆయా శాఖల పురోగతిని వివరించారు. ఏవో నిర్మలాదేవి మాట్లాడుతూ మండల కేంద్రంలో కందులు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని, ఇంకా ఎవరైనా ఉంటే కందులు కేంద్రంలో అమ్మకాలు చేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయాంత్రీకరణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో రైతుల పొలాల్లో భూసార పరీక్షలు చేస్తున్నామని, రైతులు సహకరించాలని కోరారు. విద్యుత్ శాఖ ఏఈ కిశోర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధిక లోడ్‌కు సంబంధించి ప్రభుత్వం రాయితీలు ప్రకటించిందని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యక్షుడు రాములు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికి నీటి కుళాయిల పనులు పూర్తి చేశారని, ఎక్కడా నీరు రావడం లేదన్నారు. మండల కేంద్రంలో సాగర్ నీరు రావడం లేదని, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేవలం ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేయడం తప్ప పనులు చేసి ప్రజల సమస్యలు తీర్చేవారు కరువయ్యారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితి ఉందని, అధికారులు ముందుస్తు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. జీతాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే విధంగా ఉండాలన్నారు. కొన్ని నెలలుగా పుల్లలచెరువు మండలం జిల్లా స్థాయిలో చెడ్డపేరు మోస్తోందని, దాన్ని చెరిపేసి మంచి పేరు తీసుకు రావాలన్నారు. గ్రామాల్లోని ఉపాధి పనులు సక్రమంగా జరగడం లేదని, సభలు ఏర్పాటు చేసి గ్రామస్తుల అనుమతితో పనులు గుర్తించి చేస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని, దీన్ని అధికారులు పరిగణనలోకి తీసుకుని పనులు చేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో పెట్టుబడులు తగ్గించొచ్చు



మట్టి నమూనాను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు



దొనకొండ: మట్టి నమూనా సేకరణ

దర్శి (కురిచేడు): రైతులు తమ పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయిస్తే పంటలకు అవసరమైన పోషకాలు తగిన మోతాదులో ఉపయోగించవచ్చని, దీంతో పెట్టుబడులు తగ్గించవచ్చని ఏఓ వి.బాలకృష్ణ నాయక్ తెలిపారు. మండలంలోని వెంకటాచలంపల్లిలో మంగళవారం ఆయన భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరించే విధానంపై అవగాహన కలిగించారు. భూసార పరీక్షలతో రైతులు తమ పంట పొలంలోని పోషక విలువలు తెలుసుకుంటే వేసిన పంటకు ఏయే పోషకాలు ఎంతెంత మోతాదులో అవసరమో తెలుసుకొని తగిన మోతాదులో ఎరువులు వాడవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందొచ్చని తెలిపారు. ప్రతి రైతు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మట్టి నమూనా పరీక్షించే యాప్‌లో నమోదు చేసుకోవాలని, రైతుతో పాటు నమూనా తీసే ప్రదేశాన్ని ఫొటో తీసుకోవాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. మట్టి నమూనా తీసే క్రమంలో గతంలో ఆ పొలంలో వేసిన పంట గురించి రాబోయే కాలంలో వేసే పంట గురించి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ ఏడాది మండలంలోని 23 రైతు సేవా కేంద్రాల్లో 1280 మట్టి నమూనాలు సేకరించేందుకు ప్రణాళిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా తమ పొలంలోని మట్టి నమూనాలు సేకరించేందుకు సహకరించాలని, భూమి పోషక విలువలు తెలుసుకోవాలని, మట్టి నమూనాల ఆధారిత ఎరువులు వేయాలని, మట్టి నమూనాలతో సరైన పంట తెలుసుకొని వేయాలని కోరారు. మండలంలోని ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

దొనకొండ: గ్రామాల్లో రైతులు తమ పొలాల్లో అధిక దిగుబడులు పొందాలంటే భూసార పరీక్షలు కీలకమని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల్లో 779 మట్టి నమూనాలను తమ సిబ్బందితో సేకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాలు నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ పోషకాలు జింక్, బోరాన్, మెగ్నీషియం తదితర లభ్యత ఎంత వరకు ఉన్నాయో సాగు చేయబోయే ముందు ఏ ఎరువులు ఎంత మోతాదులో వేయాలో తెలుసుకోవాలంటే మట్టి పరీక్షలు తప్పని సరన్నారు. రైతులు ఈ విషయాలను గమనించి సిబ్బందిని సంప్రదించి మట్టి పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు.

తీగలేరు కాలువ కోసం తీర్మానం చేయాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న టీ5 కాలువ పోరాట సమితి సభ్యులు

పుల్లలచెరువు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తీగలేరు టీ5 కాలువ కోసం ఏకగ్రీవంగా తీర్మానం చేయాలని తీగలేరు కాలువ సాధన సమితి సభ్యులు చెన్నయ్య, గురునాథంలు ఎంపీడీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ఆశాకిరణమైన వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. తీగలేరు టీ5 కాలువకు నిధులు కేటాయించి చిన్నకండ్లేరు ప్రాజెక్టుకు పొడిగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని పలు గ్రామాలు తీవ్ర కరువుతో అల్లాడిపోతున్నాయని, నాయకులు, అధికారులు టీ5 కాలువపై దృష్టి పెట్టకుంటే ఈ ప్రాంతం ఎడారిగా మారిపోయే పరిస్థితి వస్తుందన్నారు. సాగు, తాగు నీరు లేక ప్రజలు, పశువులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అలాంటి ఈ ప్రాంతంలో టీ5 కాలువ ఆశాకిరణమన్నారు. 21-10-2013లోనే అప్పటి ప్రభుత్వం సర్వేకు అనుమతులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా కొన్ని రోజులుగా గ్రామాల్లో పోస్టుకార్డు ఉద్యమం ద్వారా ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉద్యమానికి అంతా కలిసి రావాలన్నారు. మండల సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేయాలని కోరడంతో ఉపాధ్యక్షుడు ఎల్.రాములు ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



రైతు సంఘ సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

ముండ్లమూరు (కురిచేడు): పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వేంపాడులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ మండల కమిటీ సమావేశం మంగళవారం ఎస్‌కే మీరావలి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో రైతాంగం పరిస్థితి, పంటల ధరలపై సమీక్షించారు. మండలంలో ప్రధాన పంటలైన వరి, మిరప, పొగాకు, మొక్కజొన్న, బొప్పాయి ఉన్నాయన్నారు. రైతులు కష్టపడి పెట్టుబడులు పెట్టి పండించిన పంట ఇంటికి వచ్చే సరికి మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేక అకాల వర్షాలకు నష్టపోతూ రెండు వైపులా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు పంటను ప్రైవేట్ వ్యాపారులు జీపీఐ, ఐటీసీ కంపెనీ ప్రతినిధులు ఊరూరా తిరిగి పొగాకు పండించమని, క్వింటా రూ.16 వేల నుంచి 18 వేల వరకు కొంటామని రైతులతో సాగు చేయించి కొనుగోలు చేయకుండా అనేక కారణాలు చూపి రైతులను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని, వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేసి కార్పొరేట్ దళారులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని స్వామినాథన్ కమిటీ సిఫారసు ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించి రైతుల వద్ద పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు కేరళ తరహాలో రుణ విమోచన చట్టం చేయాలని, ఒకేసారి రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. మిరప క్వింటాకు రూ.25 వేలకు, పొగాకులో గ్రేడు కిలో రూ.250 తగ్గకుండా కొనాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు ఇన్సూరెన్సు చేయాలని, రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను సంఘటిత పరిచి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. మండల రైతు సంఘ అధ్యక్షుడు పంట ఏడుకొండలు, గంగినేని సత్యం, గాలి వెంకటేశ్వర్లు, వెంకటరామిరెడ్డి, అన్నపురెడ్డి ఆదినారాయణరెడ్డి, బి.ఏడుకొండలు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



తవ్విన రాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబర్-8లో జరుగుతున్న అక్రమ వైట్ క్వార్ట్జ్ మైనింగ్‌ను రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. సాక్షి దిన పత్రికలో మంగళవారం 'ఆగని పలుకురాయి అక్రమ తవ్వకాలు' అన్న శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. గతంలో వైట్‌క్వార్ట్జ్ ఎవరు బ్లాస్టింగ్ చేసి తీస్తున్నారు అనే విషయంపై ఆరా తీస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో అక్రమ మైనింగ్‌దారులతో అధికారులు లాలూచీ పడినట్లు ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. లేకుంటే అధికారులు అక్రమార్కులు నిలువరించడంలో అలసత్వం ప్రదర్శించరని, ఇప్పటికే వారిపై కఠిన చర్యలు తీసుకునే వారని ప్రజలు పేర్కొంటున్నారు. పరిశీలనలో మైన్స్ అధికారి పోలిరెడ్డి, తహసీల్దార్ రజనీకుమారి, ఆర్ఐ నాగరాజు, వీఆర్వో ఆంజనేయులు ఉన్నారు.

రుణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్



వివరాలు వెల్లడిస్తున్న అర్జున్ నాయక్

దర్శి (కురిచేడు): జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన దర్శిలో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. 2025-26 ఎస్సీ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలో 1305 మందికి రుణాలు మంజూరు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. 21 ఏళ్లు నిండి 50 ఏళ్ల లోపు వారు రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రుణాల కోసం మే 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, కులం సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, వైట్ రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఫోన్ నంబర్‌తో దరఖాస్తు చేసుకోవాలని ఈడీ కోరారు.

కార్మికులకు రూ.21 వేల వేతనం ఇవ్వాలి



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

దర్శి (కురిచేడు): మున్సిపల్ కార్మికులకు నెలకు రూ.21 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులతో కలిసి ఆయన మంగళవారం మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యకు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో ఆయన కార్మికులతో కలిసి సమావేశంలో అధికారులకు తమ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ అన్ని మున్సిపాలిటీల్లో రూ.21 వేల వేతనం ఇస్తుంటే దర్శిలో మాత్రం 14 నెలల నుంచి 15 వేల రూపాయలే ఇవ్వడం అన్యాయమన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ గర్నిపూడి స్టీవెన్, ఇతర కౌన్సిలర్లు మాట్లాడుతూ 25 ఏళ్లుగా పనులు చేస్తున్న 12 మంది కార్మికులకు వేతనం తగ్గించడం మంచిది కాదని, ప్రజలతో సంబంధాలు కలిగి విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వారికి అండగా ఉండాలని పేర్కొన్నారు. అందరిలా 21 వేల వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్ పిచ్చయ్య హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావుకు కార్మికులు వినతి పత్రం ఇచ్చారు. సీఐటీయూ యూనియన్ నాయకులు గొంగటి చిట్టిబాబు, ఇత్తడి కాంతారావు, గర్నిపూడి జైపాల్, గొంగటి నవీన్, గొంగటి శ్రీకాంత్, ఇత్తడి ప్రభాకర్, మున్నంగి మధు, అంజలి పాల్గొన్నారు.

రైస్‌మిల్, రేషన్ షాపులు తనిఖీ చేసిన జేసీ



రైస్ మిల్ యజమానితో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

యర్రగొండపాలెం: స్థానిక కొలకుల రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మి వాసవి రైస్‌మిల్, పెద్ద మసీదు వద్ద ఉన్న ఒక రేషన్ షాపును జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. రైస్ మిల్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బియ్యం నాణ్యతను ఆయన పరిశీలించారు. వడ్లు ఎక్కడి నుంచి తీసుకొచ్చి బియ్యం మరపడుతున్నారన్న విషయాన్ని ఆయన ఆ రైస్ మిల్ యజమాని పబ్బిశెట్టి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు నాణ్యమైన బియ్యం అందజేయాలని సూచించారు. అనంతరం పెద్దమసీదు వద్ద ఉన్న షాప్ నంబర్-6 రేషన్ దుకాణాన్ని జేసీ తనిఖీ చేశారు. ఆ షాపునకు కేటాయించిన రేషన్ బియ్యం, కార్డుదారుల వివరాలు ఆయన పరిశీలించారు. వినియోగదారులకు రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. జేసీ వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.శేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణ ఉన్నారు.


కూటమి నాయకుల భూదాహం

- అడ్డుకట్ట వేయని రెవెన్యూ అధికారులు
- వారి కనుసన్నల్లో కొనసాగుతున్న భూదందా
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- లోకాయుక్తనూ లెక్క చేయని అధికారులు

కురిచేడు: మండలంలో రోజురోజుకూ కూటమి నాయకుల భూదందాలు పెరిగిపోతున్నాయి. రెవెన్యూ అధికారులు కూటమి నాయకుల భూదందాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. కూటమి నాయకులు, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే భూదందాలు జరుగుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏడాది కాలంలో మండలంలోని కల్లూరు, పెద్దవరం, పొట్లపాడు, పడమర వీరాయపాలెం రెవెన్యూ గ్రామాల పరిధిలో వందల ఎకరాల్లో భూములు ఆక్రమణదారులు స్వాహా చేశారు. రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా బోర్డులు ఏర్పాటు చేసి కాలం గడుపుతున్నారే తప్ప పటిష్ట చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మండలంలోని పొట్లపాడు పరిధిలోని వందల ఎకరాలు కొందరికి కట్టబెట్టడంపై గ్రామస్తులు లోకాయుక్తను సంప్రదించారు. ఒక తహసీల్దార్‌ను సస్పెండ్ చేసి నాలుగు సంవత్సరాలైంది.

లోకాయుక్త ఆ భూమిని ప్రభుత్వం స్వాధీన పర్చుకుని ఆక్రమణలు జరగకుండా చూడాలని ఆదేశించింది. కానీ నేటి వరకు ఆ భూమి అన్యాక్రాంతం చేసిన వారి పేర్లపైనే ఆన్‌లైన్‌లో ఉండటమే కాదు ఏకంగా వారు ఆ భూములను దున్ని సాగు చేస్తున్నా రెవెన్యూ అధికారులు కిమ్మనక పోవడంపై ప్రజల అనుమానాలకు బలం చేకూర్చినట్లయింది. తాజాగా మంగళవారం ఆక్రమణదారులు మళ్లీ ఆ భూమిని దున్ని సాగు చేస్తున్నా రెవెన్యూ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడక పోవటంతో ఆక్రమణదారులు రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో ఆక్రమణలకు తెర తీశారనే ప్రజల అనుమానానికి బలం చేకూర్చినట్లయింది. ఇదే పరిస్థితి కొనసాగితే మండలంలో ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు సెంటు లేకుండా ఆక్రమణదారులకు కట్టబెట్టి భవిష్యత్‌లో పేదలకు, ప్రభుత్వ అవసరాలకు మిగల్చరని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి సంబంధిత అధికారులపై, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోకుంటే భవిష్యత్‌లో భూవివాదాలు సృష్టి కర్తలుగా రెవెన్యూ అధికారులు మిగిలిపోతారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కిశోర వికాసంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ భారతి

తాళ్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న కిశోర వికాసం కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సీడీపీఓ సీహెచ్ భారతి అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు బాలల వికాసంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని 11 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలపై సర్వే చేసి వారికి పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం, బాల్య వివాహాలపై సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. బాలికలు కేంద్రానికి రావాలని సూపర్‌వైజర్ జ్యోతి కోరారు. ఎంఈఓ సుబ్బయ్య, హెల్త్ సూపర్‌వైజర్ కోటేశ్వరి, ఏపీఎం దేవరాజు పాల్గొన్నారు.

ముండ్లమూరు (కురిచేడు): అన్ని గ్రామ పంచాయతీల్లో మే 2 నుంచి 10వ తేదీ వరకు కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ ఆర్.జనార్దన్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సీడీపీఓ సీహెచ్ భారతితో కలిసి కిశోర వికాసం కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు నిరోధించడం, విద్యను కొనసాగించడం, రక్షణ, భద్రత గురించి వివరించారు. 15-18 సంవత్సరాల వారికి ఈ విషయాల గురించి తెలియజేయాలని ఆయన ఆదేశించారు. ఎంఈఓ జె.సుబ్బారావు, వైద్యాధికారి జాస్మిన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గ్యాస్ గోడౌన్ల పరిశీలన

ముండ్లమూరు (కురిచేడు): మండలంలో పెట్రోల్ పంపులు, గ్యాస్ గోడౌన్లను రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని పెద్ద ఉల్లగల్లు పెట్రోలు పంపు, సింగన్నపాలెంలోని రేషన్ షాపు, స్థానిక గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌ను డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, ఆర్ఐ పీవీఎస్ఆర్ మూర్తి, వీఆర్వోలు రాఘవరెడ్డి, చల్ల బ్రహ్మతేజ, ఎం.పెద్దన్నతో కలిసి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



గాయపడిన శరత్

ముండ్లమూరు (కురిచేడు): ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొట్టిన సంఘటనలో వరగాని శరత్ తలకు బలమైన గాయమైన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు.. పసుపుగల్లు గ్రామానికి చెందిన శరత్ దర్శిలో పనులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం పసుపుగల్లు వెళ్తున్నాడు. పసుపుగల్లు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి బలంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమైంది. 108కి సమాచారం అందించడంతో సిబ్బంది ప్రథమ చికిత్స చేసి దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షలు జరిపిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకెళ్లాలని సూచించటంతో క్షతగాత్రుడిని అక్కడికి తరలించారు.